క్లుప్తంగా

లక్ష్మీదేవికి అభిషేకం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్తరా నక్షత్రం సందర్భంగా శనివారం ఉదయం లక్ష్మీదేవికి అభిషేకం నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు పొదలకూరు విద్యార్థి


లీలాగౌతమ్

పొదలకూరు : డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌కు పొదలకూరు పట్టణానికి చెందిన విద్యార్థి గుంటి లీలాగౌతమ్ ఎంపికయ్యాడు. రాష్ట్రంలో మొత్తం 26 జిల్లాల్లో స్పోర్ట్స్ స్కూల్స్‌కు ఎంపికలు నిర్వహించగా లీలాగౌతమ్ 1017 ర్యాంకుతో ప్రతిష్టాత్మకమైన వైఎస్సార్ కడపలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో నాలుగో తరగతికి ఎంపికయ్యాడు. ఈ బాలుడి తండ్రి పొదలకూరు విఘ్నేశ్వరపురం కాలనీలో సచివాలయ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


వివరాలు నమోదు చేస్తున్న తహసీల్దార్

కోవూరు : మండల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పద్మజ శనివారం పరిశీలించారు. కోవూరులోని జెడ్పీ హెచ్‌ఎస్, జేబీఆర్ పాఠశాలల్లో గతంలో వసతులు ఎలా ఉన్నాయి.. ప్రస్తుతం ఎలా ఉందనే వివరాలు నమోదు చేశారు. ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు పరిశీలించామని ఆమె తెలిపారు.

స్వచ్ఛ సాగర్‌పై అవగాహన



ఇందుకూరుపేట : అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మైపాడు తీరంలో స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్‌పై మత్స్యకారులకు శనివారం అవగాహన కల్పించారు. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో తీరప్రాంతాన్ని కాలుష్య రహితంగా కాపాడుకోవడం, పరిశుభ్రమైన తీరంగా తీర్చిదిద్దుకోవడంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వృద్ధుడు (60) మృతి చెందిన ఘటన మైపాడు గేట్ సెంటర్ సమీపంలోని కేవీఆర్ కల్యాణ మండప ఎదురుగా గల రోడ్డుపై చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు 4 / 3వ వార్డు రెవెన్యూ సెక్రటరీ అరుణకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు లభ్యంకాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నవాబుపేట పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ బాబీ కోరారు.

3న దేశవ్యాప్తంగా బ్లాక్ డే



మాట్లాడుతున్న హేమలత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశంలోని రైతులు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపట్టనున్నామని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యూఎఫ్‌ఐ) జాతీయ అధ్యక్షురాలు హేమలత పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సీడబ్ల్యూఎఫ్‌ఐ వర్కింగ్ కమిటీ సమావేశాల్లో శనివారం ఆమె మాట్లాడారు. దేశవ్యాప్తంగా రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ మూడున బ్లాక్ డేను నిర్వహించనున్నామని చెప్పారు. భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రమణరావు, జిల్లా అధ్యక్షుడు చాన్‌బాషా, సీఐటీయూ జిల్లా నేత పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

నెల్లూరు(సెంట్రల్): నగరంలో 43 మంది టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ అధికారి ఖాదర్‌వలీ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. టీబీ రోగులు మందులతో పాటు పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు.

సంక్షేమంపై ప్రజల్లో పూర్తి సంతృప్తి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


ఇస్కపాళెంలో సీసీరోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల రాష్ట్ర ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి కాకాణి శనివారం పాల్గొన్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి పనులు పెండింగ్‌లో లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ గతంలో మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహిస్తే రెవెన్యూ పరమైన సమస్యలపై అధికంగా అర్జీలు వచ్చేవని, ప్రస్తుతం అటువంటి సమస్యలు తగ్గుముఖం పట్టడం సంతోషకరంగా ఉందన్నారు. రెవెన్యూ సదస్సులు మంచి సత్ఫలితాలనిచ్చాయన్నారు. రెవెన్యూకు సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న అసైన్‌మెంట్, నోషనల్ ఖాతాలు, చుక్కల భూములు, రీ సర్వే, వన్-బీ సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ సమస్యలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎదురయ్యే ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరిస్తున్నామన్నారు. అన్నివర్గాల కోసం పెద్ద ఎత్తున సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. మీ కుటుంబానికి మేలు జరిగిందని భావిస్తేనే ఆశీర్వదించండి అని ధైర్యంగా అడుగుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వివరించారు. గడిచిన నాలుగేళ్లలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఎలా పనిచేసిందో రానున్న రోజుల్లోనూ ఇదే పంథాను కొనసాగిస్తుందన్నారు. అనంతరం ఇస్కపాళెంలో సీసీరోడ్డును మంత్రి కాకాణి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, పార్టీ నేతలు మన్నెం చిరంజీవులగౌడ్, తలమంచి సురేంద్రబాబు, కాల్తిరెడ్డి సబ్బారావు, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కోటా శేఖర్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ సభ్యులు రాయపు శీనయ్య, తాని తిరుపతి, ఎంబేటి సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


వెంకటాచలం : సీమంతాలు జరిపిస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి


మనుబోలు : పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

- సీడీపీఓ విజయలక్ష్మి

వెంకటాచలం : పోషకాహార పదార్థాలతో గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొలగమూడిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సీమంతాలు జరిపారు. ఈ సందర్భంగా సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ పోషకాహార పదార్థాల గురించి ప్రభుత్వం విస్తృత ప్రచారం చేపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ పోషకాహార పదార్థాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు గీత, సునీత, విజయలక్ష్మి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మంచి పోషకాహారం తీసుకోవాలి

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని పిడూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా మాసోత్సవాల్లో భాగంగా పోషకాహార ఆవశ్యకతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారం ఎలా తయారు చేయాలో వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోషకాహారం తీసుకోకుంటే రక్తహీనతకు గురవుతారని, మంచి పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. అనంతరం బాలామృతం, వైఎస్సార్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నాగేంద్రమ్మ, మహిళా పోలీస్ పవిత్ర, అంగన్‌వాడీలు మహాలక్ష్మి, కృష్ణవేణి, విజయమ్మ పాల్గొన్నారు.


అధిక కాలుష్యంతో ఓజోన్‌కు దెబ్బ




మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న హెచ్‌ఎం

కొడవలూరు : అధిక కాలుష్యం వల్ల ఓజోన్ పొర దెబ్బతిని మానవాళికి ప్రమాదకరంగా మారుతోందని నార్తురాజుపాళెం హైస్కూల్ హెచ్‌ఎం డి.ఓబులేసు తెలిపారు. అంతర్జాతీయ ఓజోన్ డే సందర్భంగా ఆ పాఠశాల విద్యార్థులతో గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోని పది శాతం దేశాలు అధికంగా కాలుష్యం వదలడం వల్ల ఓజోన్ దెబ్బతిని అధిక ఉష్ణోగ్రతల బారిన పడాల్సి వస్తోందన్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె.బాబునాయుడు, బి.తిరుపతయ్య, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి


కొడవలూరు : దామేగుంటలో ఆరోగ్య సర్వేను పరిశీలిస్తున్న నుడా వీసీ బాపిరెడ్డి


వెంకటాచలం : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- నుడా వీసీ బాపిరెడ్డి

కొడవలూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని నుడా వైస్ చైర్మన్, నియోజకవర్గ ఆరోగ్య సురక్ష ప్రత్యేకాధికారి బాపిరెడ్డి సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని దామేగుంటలో జరుగుతున్న సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. వీసీ వెంట ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, డీఎల్‌పీఓ రాధామాధవి, వైద్యాధికారి జి.బాలచంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు చిమటా శేషగిరి, కొట్టే మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి పి.సురేష్‌కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

వెంకటాచలం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ కృష్ణ సూచించారు. మండలంలోని పాలిచెర్లపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఇంటింటి సర్వేను తహసీల్దార్ కృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన పాలిచెర్లపాడులో జరుగనున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య నిపుణులు వచ్చి ప్రజలకు వైద్యసేవలు అందిస్తారన్నారు. దీని గురించి వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి తెలియజేయాలన్నారు. గ్రామంలో ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడేవారి గురించి తెలుసుకుని వారికి వైద్య సేవలందిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమేష్, కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి పవిత్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేత గండవరం విద్యార్థినులు


విజేతలకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంఈఓ-2 అంకయ్య

కొడవలూరు : కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఆరోగ్యం-కౌమార విద్య' అనే అంశంపై శనివారం జరిగిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో గండవరం హైస్కూల్ విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. పాఠశాలకు చెందిన కె.గౌతమి, బి.సుచిత్ర, టి.వర్షిణిప్రియ తొలి మూడు బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ఎంఈఓ-2 ఎస్.అంకయ్య ధ్రువీకరణ పత్రాలను అందజేసి, మాట్లాడారు. మండల స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకున్న విద్యార్థిని ఈనెల 22న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు జి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..


మంత్రి కాకాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మోహన్‌నాయుడు

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ వెంకటాచలం మండలాధ్యక్షుడిగా నియమితులైన కొణిదెన మోహన్‌నాయుడు శనివారం రాత్రి మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాకాణిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు విజయభాస్కర్‌నాయుడు, సుబ్బయ్యనాయుడు తదితరులు ఉన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు గ్రామానికి చెందిన వివాహిత తిరుమలశెట్టి కవిత అదృశ్యంపై ఆమె భర్త చంద్ర శనివారం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి నుంచి కవిత కనిపించకపోవడంతో ఆమె భర్త చుట్టుపక్కల ఆరాతీశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్య అదృశ్యం వెనుక వెంకటాచలం గ్రామానికి చెందిన అశోక్ ప్రమేయం ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి కాకాణి పరామర్శ



తోటపల్లిగూడూరు : నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్, తోటపల్లిగూడూరు వైఎస్సార్‌సీపీ నేత మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. సుబ్రహ్మణ్యంగౌడ్ సోదరుడు కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం సుబ్రహ్మణ్యంగౌడ్ సోదరుడి నివాసానికి మంత్రి కాకాణి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్నివిధాలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, స్థానిక నేతలు మన్నెం చిరంజీవులగౌడ్, పాకం ప్రవీణ్ కుమార్, అన్నం హరిప్రసాద్ ఉన్నారు.

బ్యాటరీ ట్రై సైకిల్ అందజేత



బుచ్చిరెడ్డిపాళెం : వవ్వేరుకు చెందిన దివ్యాంగురాలు తూరా శీనమ్మకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా శనివారం బ్యాటరీ ట్రై సైకిల్‌ను అందజేసినట్లు నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి తెలిపారు. ఇటీవల తమ గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి శీనమ్మ ట్రై సైకిల్ కావాలని కోరగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా దాదాపు రూ.35 వేల విలువ చేసే బ్యాటరీ ట్రై సైకిల్‌ను పంపినట్లు తెలియజేశారు. దీనిని బాధితురాలికి వవ్వేరులో అందజేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

సీపేజీతో నిమ్మసాగు అసాధ్యం


సీపేజీతో ఎండిన నిమ్మతోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

- ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలి
- హార్టికల్చర్ వర్సిటీ శాస్త్రవేత్తల వెల్లడి

పొదలకూరు : కండలేరు జలాశయం సీపేజీ(ఊటనీరు) వల్ల సమీప పొలాల్లో నిమ్మసాగు చేయడం అసాధ్యమని తిరుపతి హార్టికల్చర్ వర్సిటీ శాస్త్రవేత్తలు ముకుంద లక్ష్మి, శ్రీనివాసులురెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు కండలేరు సీపేజీతో ఎండుతున్న నిమ్మతోటలను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా నిమ్మతోటల రైతులతో మాట్లాడుతూ జలాశయం అతిసమీపంలో ఉండడంతో నిమ్మతోటలు ఊటెక్కి వేర్లు కుళ్లి చెట్లు ఎండుముఖం పడుతున్నాయని తెలిపారు. నిమ్మసాగు సాధ్యపడదని, కొబ్బరి వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. తాము పరిశోధనలు చేసి ఎలాంటి పంటలు సాగుచేయాలో నివేదికను తయారు చేసి వెల్లడిస్తామన్నారు. కండలేరు కట్ట కింద పులికల్లుకు చెందిన ఎనిమిరెడ్డి పెంచలరెడ్డి, ఆరిక పెంచలనర్సారెడ్డి, కడపల పెంచలరెడ్డి, పలుకూరు వెంకటరమణారెడ్డికి సుమారు 12 ఎకరాల నిమ్మతోటలు ఉన్నాయి. వీరు 2021లో జలాశయం నుంచి ఊటనీరు తోటల్లో చేరి చెట్లు ఎండిపోతున్నాయని తెలుగుగంగ అధికారులకు రాతపూర్వకంగా విన్నవించారు. ఇటీవల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రైతుల తోటలను పరిశీలించి శాస్త్రవేత్తలను పంపి నివేదిక అందజేయాల్సిందిగా సూచించారు. శాస్త్రవేత్తల వెంట జిల్లా ఉద్యానాధికారి ఎంవీ సుబ్బారెడ్డి, హెచ్‌ఓ ఆనంద్, రైతులు పెంచలరెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

- వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం : ఆరోగ్యంపై ఎవరూ అశ్రద్ధ చూపొద్దని విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి సూచించారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో విజయ డయాగ్నోస్టిక్స్ సెంటర్ సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆహారపు అలవాట్లు, పనిఒత్తిడితో చాలా మంది ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకుని కొద్దిపాటి వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఉదయ్‌శంకర్, సునీత, విద్యాప్రభాకర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కృషి చేయండి


ఉద్యోగులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న పోర్టు ప్రతినిధులు

ముత్తుకూరు : కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదాని కృష్ణపట్నం పోర్టు సీఓఓ సంజయ్ పేర్కొన్నారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పోర్టు ఆవరణలో శనివారం మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఓజోన్ పొర పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. భూమి మీద జీవన విధానం బాగుండాలంటే ఓజోన్ పొర దెబ్బతినకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందులో భాగంగానే విధిగా మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. అనంతరం పోర్టు ఉద్యోగులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ హెడ్ గణేష్‌శర్మ, సెక్యూరిటీ జీఎం మనోహర్‌బాబు, రమేష్‌బాబు, వేణుగోపాల్‌రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈఈ బాధ్యతల స్వీకరణ


నూతన ఈఈను సన్మానిస్తున్న నాయకులు

కోవూరు : మండల కేంద్రంలోని నేతాజీనగర్‌లో ఉన్న విద్యుత్‌శాఖ కార్యాలయంలో తొలి ఈఈగా విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించేందుకు తమ సిబ్బందితో కలిసి కృషి చేస్తామన్నారు. అనంతరం డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కృషితో కోవూరులో ఏడీ కార్యాలయం, ఈఈ కార్యాలయం వచ్చిందన్నారు. అనంతరం ఈఈను పలువురు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఏడీలు చిరమన సతీష్, శ్రీనివాసులు, సునీల్‌కుమార్, కృష్ణమోహన్, ఏఈలు పాల్గొన్నారు.

చవితికి గణపతి విగ్రహాలు సిద్ధం


ముత్తుకూరులో అమ్మకానికి పెట్టిన గణపతి విగ్రహాలు

ముత్తుకూరు : వినాయక చవితి పండగకు అవసరమైన గణపతి విగ్రహాలు ముత్తుకూరులో అమ్మకానికి సిద్ధం చేశారు. గ్రామాల్లో వీధులు, కూడళ్లలో ప్రతిష్టించేందుకు వీలుగా వినాయక విగ్రహాలను వివిధ రూపాలు, పలు ఆకారాలతో తయారు చేసి అమ్మకాలకు ఉంచారు. రూ.5,000ల నుంచి రూ.10,000ల వరకు ధరలు నిర్ణయించారు.

మండల స్థాయి క్రీడా జట్ల ఎంపికలు


అథ్లెటిక్స్‌లో తలపడుతున్న విద్యార్థులు

ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురం ఎంవీఆర్‌ఆర్ హైస్కూల్‌లో మండల స్థాయి అథ్లెటిక్స్, ఖోఖో క్రీడా జట్లను శనివారం ఎంపిక చేశారు. ఈ పోటీలకు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాల హెచ్‌ఎం పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలను మండల విద్యాశాఖాధికారులు వెంకట్ నాయక్, సునీల్‌కుమార్ పరిశీలించారు. వ్యాయామ టీచర్లు అరోరా, ముజీర్, జ్యోతి, పల్లవి, రేణుక, హరి, ప్రసాద్, వెంకటకృష్ణ, సుందర్‌బాబు, లక్ష్మణ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.